

# తాతయ్య కొనిపెట్టిన బొమ్మ

కథ

**మనుష్యులు ఒక్కొక్కరూ ఒక్కొక్కరి ప్రభావంతో పెరుగుతారు. బాల్యంలో ముఖ్యంగా ఎవరి ప్రభావం మన మీద అధికంగా ఉంటుందో, ఆ ప్రభావం చివరిదాకా కొనసాగుతుంది.**

నా విషయంలో అటువంటి ప్రభావం చూపిన వ్యక్తి మా తాతయ్య. ఈ రోజుకీ నా వెనుక ఉన్న ఆ తాతయ్య వ్యక్తిత్వ ప్రభావం, శిక్షణ, సంస్కారం, విలువలు- ఇవన్నీ నన్ను జీవితంలో ఋజుమార్గంలో నడిపించడానికి ఎంతో దోహదం చేసాయి.

బాల్యంలో తరచూ తాతయ్య మా ఇంటికి వస్తూ ఉండేవారు. మేం- అంటే అమ్మ, నాన్న, నేను విడిగా ఇంకో ఇంట్లో ఉండేవాళ్ళం. తాతయ్య, బామ్మ ఇంకోచోట వాళ్ళు కట్టుకున్న బంగళాలో ఉండేవారు. తాతయ్య నాకు జ్ఞాపకం ఉండి ఏ రెండో ఏటో నాకు పరిచయం అయ్యారు. అమ్మ నన్ను బంగళాకి తీసుకువెళ్ళి తాతయ్యకి, బామ్మకి నాతో నమస్కారాలు చేయించడం జ్ఞాపకం.

తాతయ్య ఒక మహావ్యక్తి.

అటువంటి వైశిష్ట్యం మనుష్యులలో అరుదుగా ఉంటుంది. అంతటి క్రమశిక్షణ, విలువల పట్ల నిబద్ధత, భక్తి, తాత్త్విక జీవన దృష్టి, వేదాంతం, ఆశ్రమ జీవనం ఇవన్నీ మనుష్యులలో చాలా తక్కువగా ఉంటాయి. కేవలం మహర్షులు, దేవతలలోనే అటువంటి విలువలు, క్రమశిక్షణ, వేదాంతం చూస్తాం.

మొట్టమొదట తాతయ్యని చూసినప్పుడు ఆయన రూపం, వస్త్రధారణ నాకెంతో భక్తి, గౌరవం కలిగించాయి. తెల్లని ధోవతీ, లాల్చీ, మెడలో రుద్రాక్ష మాలలు, వేళ్ళకి ఉంగరాలు, నుదుట మూడు విబూతి రేఖలు, తెల్లని పొట్టి జుట్టు, పిలక, చేతిలో కర్ర ఉండేవి.

నేను ఆయన పాదాలకు శిరస్సు వంచి నమస్కరించితే నన్ను "దీర్ఘాయుష్మాన్‌భవ" "విద్యా ప్రాప్తిరస్తు" అని ఆశీర్వదించారు.

ఆ తర్వాత నాకు తాతయ్యే అక్షరాభ్యాసం చేసారు. పలకమీద "ఓం నమఃశివాయ సిద్ధం నమః" అని రాయించి బలపంతో దిద్దించారు. నేను పుట్టుకతో మూగపిల్లని. తాతయ్యే నాకు ఆయన మంత్రశక్తితో మాట తెప్పించారు. అందుకోసం నన్ను బాసర తీసుకువెళ్ళి ఏదో పసరు మందు తాగించారు. అక్కడ నాకు నాలుక మీద ఏవో అక్షరాలు రాసారు.

ఆతర్వాత నా గొంతులో నుండి "ఆఁ" అన్న శబ్దం వచ్చింది. ఆ తర్వాత "అమ్మ" అనే మాట వచ్చింది. తర్వాత బాగా మాటలు వచ్చాయి.

నా పేరు బాలచంద్రిక.

అయినా తాతయ్య ఎప్పుడూ నన్ను పేరుతో పిలవరు.

"అమ్మాయీ..." అనే పిలుస్తారు. నాకు అక్షరాభ్యాసం అయిన తర్వాత తాతయ్య మా ఇంటికి తరచూ వచ్చేవారు. నాకు చదువు చెప్పేవారు. పురాణ కథలు- అందులో ముఖ్యమైనవి అన్నీ తాతయ్యే నాకు చెప్పారు. నచికేతుడి కథ, గురువుగారి లేగదూడ మూతుల దూది నురగతో కడుపు నింపుకున్న ముని బాలకుడి కథ, రామాయణం, మహాభారతం, భాగవతం,

**ముదిగొండ శివకౌముదీదేవి**

బలిచక్రవర్తి కథ, దశావతారాలు, దేవీభాగవతం, దశకుమార చరిత్ర- ఇలా ఎన్నో పురాణ కథలు తాతయ్య నాకు దాదాపు రోజూ చెప్పేవారు. ఆ విధంగా నా మనస్సు ఒక తత్త్వదృష్టి, ధర్మదృష్టి బాల్యంలోనే అలవరచుకోడానికి ఆ బోధన, శిక్షణ నాకు ఉపయోగపడ్డాయి.

నాన్న స్కూల్ టీచర్. అమ్మ ఉద్యోగం చేసేది కాదు. ఇంట్లోనే ఉండేది. బంగళా పేరుకి బంగళా. కానీ రెండు కుటుంబాలుండేంత స్థలం లేదు అక్కడ. అందుకని నాన్న, అమ్మ, నేను వేరే ఇంట్లో ఉండేవాళ్ళం.

తాతయ్య ఎక్కడికి వెళ్ళినా నన్ను వెంట తీసుకువెళ్ళేవారు. మాది గురు సంప్రదాయం. శిష్యులతో మాట్లాడటానికి వారి ఇళ్ళకి వెళ్ళినప్పుడు, దేవాలయాలకి వెళ్ళినప్పుడు ఇంటి పనుల మీద ఏ బియ్యం బస్తాలు తెప్పించడానికో వెళ్ళినప్పుడు, బ్యాంకుకి వెళ్ళినప్పుడు తాతయ్య నన్ను వెంట తీసుకువెళ్ళేవారు. బియ్యంలో రకాలు, ఏవి మంచివి, పప్పుల్లో రకాలు, ఏవి మంచివి, గోధుమల్లో రకాలు, ఏవి మంచివి- ఇవన్నీ ఎన్నిక చేయడం, బ్యాంకు పాస్‌బుక్ ఉపయోగించడం ఇవన్నీ తాతయ్య నేర్పించారు నాకు. సిమెంట్, ఇటుకలు, చెక్క వీటిలో మంచివి ఎన్నిక చేయడం, కూరలు మంచివి ఎన్నిక చేయడం ఇలాంటివన్నీ తాతయ్యే నేర్పించారు. మా తాతయ్య మా ఊళ్ళో సంస్కృతాంధ్ర కళాశాలలు రెండు స్థాపించారు. పురుషులకి ఒక కళాశాల, స్త్రీలకి ఒక కళాశాల స్థాపించారు. ఆయన జీవితమంతా ఆ కళాశాలల నిర్మాణం, పరిపాలన, విద్యా వ్యాప్తికి ధారపోసారు.

స్త్రీల కళాశాల పేరు దుర్గా సంస్కృతాంధ్ర కళాశాల. ఆ కళాశాల పాలకవర్గంలో తాతయ్య కార్యదర్శిగా ఉండేవారు. పాలకవర్గం సమావేశాలు నిర్వహిస్తూ నన్ను అక్కడికి తీసుకువెళ్ళేవారు. నాలుగేళ్ళ వయస్సులో ఒక డిగ్రీ కాలేజీ పాలకవర్గం సమావేశంలో, నాకంటే పెద్దవాళ్ళు, పండితుల పక్కన కుర్చీలో కూర్చొని పాల్గొనడం- అంటే వారు మాట్లాడుకునేది వినడం నాకు గొప్పగా, గౌరవంగా ఉండేది.

కుల, మత, భేదం లేకుండా, స్త్రీలు, పురుషులు అనే జండర్ వివక్ష లేకుండా అందరూ విద్య నేర్చుకోవాలని తాతయ్య చేసిన ప్రబోధ, కళాశాల నిర్మాణానికి ఇటుకలు మోసిన ఆయన దీక్ష, పట్టుదల, జోలె కట్టి చందాలు సేకరించిన ఆయన లక్ష్యశుద్ధి, తన వద్దనున్న ధనం అంతా కళాశాలకు దానం చేసిన ఆయన వితరణ, అన్నీ నాకు ఆదర్శప్రాయంగా, మార్గదర్శకంగా ఉండేవి.

మా ఊళ్ళో గోవిందరాజస్వామి జాతర ప్రతి

ఏటా జరిగేది. ఆ జాతరకి తాతయ్య తప్పకుండా వెళ్ళి రథోత్సవంలో పాల్గొనేవారు. తాతయ్య వెళ్ళి రథం లాగడంలో ఒక చెయ్యి వేయడం ఆనవాయితీ.

ప్రతీ ఏడూ తాతయ్య నాకు నడక వచ్చినప్పటినుండీ నన్ను ఆ జాతరకి తీసుకువెళ్ళేవారు. అక్కడ రకరకాల బొమ్మలు, పంచదార చిలుకలు అమ్మేవారు. నేను సంక్రాంతికి బొమ్మల కొలువు పెట్టేదాన్ని. అందుకని నాకు గోవింద రాజస్వామి జాతరలో ఏటా ఒకటి, రెండు కొత్త బొమ్మలు కొనిపెట్టేవారు. మామిడి, సీతాఫలం, అరటి, ఆపిల్ పండ్ల బొమ్మలు, గోపాలకృష్ణుడు, వినాయకుడు, ఇలా రకరకాల మట్టిబొమ్మలు నాకు జాతరలో కొని ఇచ్చేవారు. నేను ఆ బొమ్మలు దాచుకుని ప్రతి ఏడూ సంక్రాంతి బొమ్మలు కొలువులో అవి పెట్టేదాన్ని.

కాలం గడిచింది.

రెండు దశాబ్దాలు గడిచాయి.


నేను పెద్దదాన్నయ్యాను. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసాను. లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. కథలు, కవితలు రాస్తున్నాను. త్వరగానే గుర్తింపు, పేరు వచ్చింది. తాతయ్య చనిపోయారు పదేళ్ళక్రితం.

నా చిన్నప్పటి బొమ్మలన్నీ ఎక్కడో పోయాయి. ఐదు అంచెల నా బొమ్మల కొలువులోని చిన్న పెద్ద బొమ్మలు మట్టివి, ప్లాస్టిక్‌వి, మెటల్‌వి అన్నీ పోయాయి. చిన్నప్పుడు నేను ఆ బొమ్మల కొలువు నిర్మిస్తూ ఒక ఊహా ప్రపంచం సృష్టించుకునేదాన్ని. ఒక దేవాలయం, ఒక రోడ్డు, ట్రాఫిక్, ఒక జూ, ఒక ఇల్లు, నేలమీద మట్టిపోసి ఒక పార్కు ఇవన్నీ చేసేదాన్ని.

ఆ బొమ్మలకి పూజచేయడం, నైవేద్యం పెట్టడం వీటన్నింటిలో నాకు ఒక దైవత్వాన్ని సృజించిన భావనకలిగేది. ఆ బొమ్మలతో కలిసి నేను ఒక కుటుంబం అనీ, ఆ కుటుంబాన్ని చూసుకునే బాధ్యత నాదే అనీ, నేను కుటుంబ పెద్ద అనీ ఒక భావం ఉండేది. సంక్రాంతి మూడు రోజులూ ఒక ఉత్సవ సంరంభం నన్ను చుట్టుముట్టేది.

అమ్మ, నాన్న చనిపోయారు ఐదేళ్ళక్రితం. తాతయ్య ఉండగానే నాకు పెళ్ళి చేసారు. నా భర్తకి ఈ బొమ్మల కొలువులూ, సంప్రదాయాలు అన్నీ చిరాకు. అతడు కొంచెం నాస్తికుడు. కొంచెం కాదు పూర్తి నాస్తికుడు-అనే అనుకోవచ్చు. ఏదో నేను అందంగా ఉన్నానని చేసుకున్నాడు. కానీ అతనికి నేను చదివిన తెలుగు సాహిత్యం, ఈ సంప్రదాయాలు అన్నీ చిరాకు. మా పాప చైత్ర. దానికి ఇవన్నీ నేర్పించవద్దు, ఆధునికంగా పెంచాలి జుట్టు కత్తిరించి, పాంటూ, షర్టూ వేసి అంటాడు. అతడు ఒక కంప్యూటర్ ఇంజనీరు. ఇంట్లో కూడా పిల్లని కూర్చోబెట్టి కంప్యూటర్, వీడియో గేమ్స్ నేర్పిస్తూ ఉంటాడు. అదే భవిష్యత్తు అని అతడి విశ్వాసం.

నాకు ఆడపిల్లకి లక్షణంగా జడలు వేయాలనీ, పండగలకీ, పుట్టినరోజులకీ పూలజడ వేయాలనీ ఉంటుంది. చక్కగా పట్టు పరికిణీ కుట్టించి, మెళ్ళోగొలుసు, చెవులకి జూకాలు, చేతులకి గాజులు పెట్టాలని నా ఉద్దేశ్యం.



నా కూతురు చెబితే వింటుంది. కానీ ఎవరు చెబితే వినాలి? అని దాని సమస్య.

కాలం ముందుకే పోతుంది. కానీ కాలంతో పాటూ అంతఃసూత్రంగా మన సంస్కృతీ, విలువలు ముందుకి వెళ్ళాలిగా! అది కంప్యూటర్ నేర్చుకోవాలంటే మూడేళ్ళ పిల్ల, పట్టుపరికిణీ మానేసి స్కిగ్ పాంట్లూ, పొట్టి చొక్కాలు వేసుకుని, ఆ మొహాన బొట్టు లేకుండా తిరగాలా? అన్నది నా ప్రశ్న.

**నేను చైత్రకి చెప్పాను నువ్వు శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలి, తెలుగు సాహిత్యం చదవాలి. ఆ తర్వాత నువ్వు ఏ ఇంజనీరువైనా నాకు అభ్యంతరం లేదని. అది సరే అన్నది. అదే నా ధైర్యం. "బొమ్మల కొలువు పెట్టించనా?" అంటే సరే అన్నది.**

దానికి బొమ్మల పెళ్ళి, అన్నాలాట నేర్పించవద్దు, ఎప్పుడూ వీడియో, కంప్యూటర్ గేమ్స్ ఆడాలంటే ఎలా?దాని శరీరం, మనస్సు, వ్యక్తిత్వం సమగ్రంగా బహుముఖంగా వికసించవద్దూ? దానికి కర్నాటక సంగీతం నేర్పిస్తానంటే వద్దు గిటార్ నేర్పిస్తానంటాడు. నేనేం వ్యాఖ్యానించలేదు. కానీ అతని ధోరణి నాకు నచ్చలేదు. మౌనం వహించాను.

ఇవాళ పాత పెట్టెలో వస్తువులు సర్దుతూ ఉంటే ఒక తెల్లని మట్టి బొమ్మ దొరికింది. ఏమిటి అని చూస్తే సరస్వతి. చిన్నప్పుడు గోవింద రాజస్వామి జాతర్లో తాతయ్య కొనిపెట్టినబొమ్మ.

"అమ్మలూ!" నా కూతుర్ని పిలిచాను.

"ఏంటమ్మా!" అన్నది. బంగారుతల్లి పిలవగానే వస్తుంది. వాళ్ళ నాన్నలాగా వినిపించనట్లు నటించి, నాలుగుసార్లు పిలిచాక పలకదు.

"నీకీ బొమ్మ కావాలా, ముత్తాతగారు కొన్న బొమ్మ, నా చిన్నప్పటిది" అన్నాను భయపడుతూ. చైత్ర పరిగెత్తుకువచ్చింది చేతిలో వీడియో గేమ్ పక్కన పెట్టి.

"భలే బావుందమ్మా!" అన్నది.

దానికి సరస్వతి అంటే ఇష్టం. సరస్వతీదేవి వీణని కచ్ఛపి అంటారని చెబితే దాని బొమ్మకి కచ్ఛపి అని పేరు పెట్టుకుంది. (బార్బీ డాల్‌కి!!!)

"పాతది నాన్నా. రంగు పోయిందేమో. నీకు నచ్చుతుందో, లేదోఅని నాకు భయం"అన్నాను. ముందు ఆపిల్ల తండ్రికి భయపడేదాన్ని. ఇప్పుడు ఈ పిల్లకి భయపడాల్సి వస్తోంది. ఊరికే వ్యాఖ్యానాలు చేస్తారు. అందుకని నాకు భయం.

"ఈ బొమ్మ బావుందమ్మా! నాకు నచ్చింది. రంగు వెలిసిపోతేనేం, మట్టిదైతేనేం- సరస్వతి బొమ్మ కదా!" అన్నది ఆరిందాలా.

మా అత్తవారింట్లో దసరాకి బొమ్మలు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడు దీనితో బొమ్మలు పెట్టిద్దాం అనుకుంటున్నాను. వాళ్ళ నాన్న ఆగ్రహంతో ఏం అనకుండా ఉంటే. మొన్ననే దాని అక్షరాభ్యాసం సందర్భంగా మా ఇద్దరి మధ్యా చిన్న గొడవ జరిగింది. నేను దాన్ని తెలుగు మీడియంలో చేరుస్తాను అంటాను. తను ఇంగ్లీషు మీడియం కాన్వెంటుకి వెళ్ళాలి నా కూతురు అంటాడు.

చివరికి ఇంగ్లీషు మీడియంలోనే వేసాం.

నేను చైత్రకి చెప్పాను నువ్వు శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలి, తెలుగు సాహిత్యం చదవాలి. ఆ తర్వాత నువ్వు ఏ ఇంజనీరువైనా నాకు అభ్యంతరం లేదని. అది సరే అన్నది. అదే నా ధైర్యం. "బొమ్మల కొలువు పెట్టించనా?" అంటే సరే అన్నది.

ఇప్పుడు ఈ బొమ్మ దానికి నచ్చింది.

"బొమ్మల కొలువులో పెట్టుకుంటానమ్మా" అన్నది.

నేను సంతోషించాను.

తాతయ్య దగ్గర నేను నేర్చుకున్న విషయాలు, ఆ సాంస్కృతిక వారసత్వం- ఆ బేటన్ నా పిల్లల ద్వారా ముందు తరాలకి అందాలి. అంతకన్నా పెద్ద కోరిక ఏమీ లేదు నాకు.

ఇప్పుడు ఈ వారసత్వ సంపదగా నాకు ఆ బొమ్మ మిగిలింది. ఉండవలసినది అదే. ముందు తరాలకి అందవలసినదీ అదే. సరస్వతి. విద్యాస్వరూపం.

తరతరాలుగా మా ఇంట్లో ప్రవహించిన ఒక దేవలోకపు నదీ ప్రవాహం ఆ విద్య.

మా తాతయ్య రెండు డిగ్రీ కళాశాలలు పెట్టి సర్వులకూ బోధించిన విద్య- ఆయన ప్రమోట్ చేసిన అనియత విద్య- రక్తమాంసాలను చమటగా మార్చి ఉపాధ్యాయులను మా ఇంట్లో ఉంచుకుని బోధింపజేసిన విద్య- ఆ విద్యా స్వరూపం- ఆ సంస్కృతీ వారసత్వం ఈ బొమ్మ.

"అది నా కూతురికి నచ్చింది. నాకింకేం కావాలి?" అనుకున్నాను.

చైత్ర ఆ బొమ్మ తీసుకుని వెళ్ళింది. తన బొమ్మల పెట్టెలో దాచుకోడానికి. ఆ సరస్వతే మాకు ఇంకా అన్నం పెడుతోంది, అస్తిత్వాన్ని ఇస్తోంది.

భావితరాలకీ అలాగే అస్తిత్వాన్ని ఇవ్వాలని నా ఆకాంక్ష, అందుకు చైత్ర నా ఆశ.